
ప్రజాశక్తి
బుధవారం 4 డిసెంబర్ 2024 5
శ్రీ సత్యసాయి





హంద్రీనీవాను.. అలామార్చుకున్నారు..!

◆ మొదటి దశ వెడల్పు తగ్గించి.. రెండో దశ లైనింగ్ ..!

◆ రెండో దశ లైనింగ్‌కు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా మొదటి దశ కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు తగ్గించే యోచనలో ప్రభుత్వముంది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారుల సమావేశంలోనే దీనిని వెల్లడించారు. వరదల సమయంలో హంద్రీనీవా ద్వారా అదనంగా నీరు తీసుకోవాలన్న యోచనలో కాస్త వెనక్కు తగ్గినట్టైంది. రెండో దశ లైనింగ్ పనులను చేపట్టాలని నిర్ణయించడమే కాకుండా పనులకు నిధులు మంజూరు చేస్తూ మంగళవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాలువ సామర్థ్యం పెంచకుండా లైనింగ్ చేపడితే అదనంగా చేకూరే ఉపయోగమేమీ లేదనే భావన విపక్షాలు, రైతుల నుంచి వ్యక్తం అవుతోంది.

మొదటి దశ ప్రవాహ సామర్థ్యం కుదింపు

హంద్రీనీవా మొదటి దశ అంటే శ్రీశైలం డ్యామ్ మల్యాల వద్ద నుంచి జీడిపల్లి వరకు వస్తుంది. అక్కడి నుంచి దిగువకు గొల్లపల్లి, కదిరి మీదుగా కుప్పం వరకు రెండో దశ 40 టిఎంసిల నీటిని కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు ఇవ్వాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. 2012లో ఈ ప్రాజెక్టు మొదటి దశకు నీళ్లు ఇచ్చారు. అప్పటి నుంచి ఏటా హంద్రీనీవా ద్వారా జిల్లాకు నీరొస్తోంది. ఇప్పుడున్న కాలువ ప్రవాహ సామర్థ్యం 2800 క్యూసెక్కులు. ఈ ప్రవాహ సామర్థ్యంతో మూడు జిల్లాలకు సాగు, తాగునీటిని పూర్తి స్థాయిలో అందివ్వడం సాధ్యం కాదని పది వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో హంద్రీనీవా కాలువ ప్రవాహ సామ ర్థ్యం ఏర్పాటు చేయా లని డిమాండ్ వచ్చింది. వరదలొచ్చి వృథాగా నీరు దిగువకు పోతున్న సమయంలో రోజుకు ఒక టిఎంసి చొప్పునైనా నీరు ఈ కరువు ప్రాంతానికి అందించి నిలువ ఉంచుకుంటే ప్రయోజనమని ఈ డిమాండ్‌ను తీసుకొచ్చారు. ఇప్పుడున్న కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతూ 2021 వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు టెండర్లు కూడా ఆహ్వానించింది. ఇదే కాలువకు సమాంతరంగా మరో నాలుగు వేల క్యూసెక్కులతో రెండో దపాలో ఒక కాలువను తీసుకొస్తామని కూడా గతంలో ప్రకటించింది. ఈ పనులు టెండర్ దశలోనే ఆగిపోయాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులు కాకుండా 3850 క్యూసెక్కులతోనే తీసుకురావాలని యోచిస్తోంది. ఇప్పుడున్న 12 పంపులతో దీన్ని అదే విధంగా నడుపవచ్చునని బావిస్తోంది. దీనిపై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మేరకు ప్రవాహ సామర్థ్యాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

రెండో దశ లైనింగ్

మొదట దశపై తర్జభర్జనలు నడుస్తున్న క్రమంలోనే రెండో దశ లైనింగ్‌కు ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులిచ్చింది. 216వ కిలోమీటరు నుంచి 400 కిలోమీటరు వరకు 12 భాగాలకు పనులను విడగొట్టి లైనింగ్ చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ.936.70 కోట్లు కేటాయించింది. ఇప్పుడున్న కాలువలో నీరు చివరి వరకు వెల్లడం ఇబ్బందికరంగా ఉందని భావించి నీటి వేగాన్ని పెంచేందుకుగానూ ఈ లైనింగ్‌ను చేపడుతోంది. తద్వారా జీడిపల్లి నుంచి చివరనున్న కుప్పం వరకు నీటిని అందించవచ్చన్న యోచనలో ప్రభుత్వమున్నట్టు తెలుస్తోంది.

వెడల్పు లేకుండా లైనింగ్ పనులతో ప్రయోజనం లేదు

కాలువను వెడల్పు చేపడతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టాలి. అలా కాకుండా కేవలం లైనింగ్ మాత్రమే చేపడితే ప్రయోజనం లేదు. ప్రజల ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఈ పనులు చేసినట్టు ఉంటుంది. ఈ ఏడాది శ్రీశైలం డ్యామ్ పొంగిపొర్లినా అనంతపురం జిల్లాకు అదనంగా నీరు తీసుకోలేకపోవడానికి ప్రధాన కారణం కాలువ ప్రవాహ సామర్థ్యం లేకపోవడమే. ఈ కాలువ సామర్థ్యం పెంచకుండా లైనింగ్ చేపడితే అదనంగా చేకూరే ఉపయోగమేమీలేదు. కావున ప్రభుత్వం పునరాలోచించి మొదటి విడత కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలి.

వి.రాంభూపాల్,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు.



ఆర్వోబీ నిర్మాణం చేపట్టే ప్రాంతం.

కియా రాకతో ప్రపంచ చిత్రపటంలో పెనుకొండ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. వేలాదిమంది ఉద్యోగులు, కార్మికులతో నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటోంది. వాహనరాకపోకలు నిత్యం సాగుతుంటాయి. వాహనాలు, జనం రద్దీకి తగ్గట్టుగా రోడ్లు విస్తరణ జరగకపోవడంతో నిత్యం ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు చాలా మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు వైకల్యానికి గురయ్యారు. కియా ఎదురుగా రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మించకపోవడం వల్లనే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణచేసి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పనులు కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా ఏడు నెలల్లో 12 భారీ ప్రమాదాలు ఈ ప్రాంతంలో జరిగాయి.

ఆర్ఓబిని అటకెక్కించేశారు..!



◆ కియా సమీపంలో జాతీయ రహదారిపై తీవ్ర రద్దీ

◆ ఏడు నెలల్లో 12 ప్రమాదాలు

◆ ఆర్‌ఒబికి భూసేకరణ పూరైయినా పనులు ప్రారంభ కాని వైనం

◆ పట్టించుకుని వైసిపి ప్రభుత్వం

◆ కూటమిపైనే ఆశలు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మండలం యర్రమంచి సమీపంలో 2017లో దాదాపు 500 ఎకరాల్లో కియా ఇండియా పరిశ్రమ ఏర్పాటైంది. ఆ సమయంలో కియా అనుబంధ పరిశ్రమలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా జాతీయ రహదారి పక్కనే రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కియా యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. కియా పరిశ్రమ వచ్చి ఎనిమిదేళ్లు పూరైనప్పటికీ ఆర్వోబీ నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. దీంతో పరిశ్రమకు సంబంధించిన వాహనాలు, కార్మికులు, ఉద్యోగుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయి. కియా ప్రధాన ద్వారం ఎదురుగా జాతీయ రహదారిపై పరిశ్రమలోకి సామగ్రి, తయారైన కార్లు తరలించే భారీ కంటైనర్లు రాకపోకలతో ప్రతి రోజూ రద్దీగా ఉంటోంది. ఇదే సమయంలో అనువైన రోడ్డు లేక ప్రమాదాలూ జరుగుతున్నాయి. కియా నుంచి దుద్దేబండ క్రాస్ మీదుగా అనుబంధ పరిశ్రమల్లోకి వెళ్లే వాహనాలు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి యూటర్న్ తీసుకోనేందుకు ఇంధనం వృథా అవుతుందని, వాహనదారులు రోడ్డుకు అడ్డదిడ్డంగా ప్రయాణించడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

భూసేకరణ పూరైయినా..

రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకు 2022లో 36 ఎకరాల భూసేకరణ పూరైయ్యింది. ఏళ్లు గడుస్తున్నా ఆర్వోబీ నిర్మాణం పనులు కార్యరూపం దాల్చలేదు. గత టిడిపి హయాంలో ఆర్వోబీ నిర్మాణంకు అప్పట్లో భూసేకరణ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. బ్రిడ్జి నిర్మాణం చేసే ప్రాంతం సమీపంలో ఓ ప్రజాప్రతినిధి బంధువులకు చెందిన భూమి ఉంది. ఆర్వోబీ నిర్మాణం చేస్తే ఈ భూమిని ప్రభుత్వం సేకరించాల్సింది. దీంతో ఆ ప్రజాప్రతినిధి ఆర్వోబీ నిర్మాణంకు అడ్డు పడడంతో బ్రిడ్జి నిర్మాణం ముందుకు సాగలేదు. అనంతరం బ్రిడ్జికోసం వేరే ప్రాంతంలో భూసేకరణ చేశారు. ఇది చేసిన తర్వాత ప్రభుత్వం మారడంతో ఆర్వోబీ నిర్మాణ పనులు మళ్లీ అటకెక్కాయి.

పట్టించుకోని వైసిపి ప్రభుత్వం

కియా పరిశ్రమ నిర్మాణం పూర్తి అయ్యి ఉత్పత్తి ప్రారంభించే సమయానికి 2019 ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఆర్వోబీ పనులు నిలిచిపోయాయి. ఆ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆర్వోబీ ఊసే లేకుండా పోయింది. భూసేకరణ చేసి పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేసినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఆర్‌ఒబి నిర్మాణ పనులు ఏళు గడుస్తున్న టెండర్ల దశలోనే ఉన్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి. రెండేళ్ల క్రితమే భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి భూమిని ఎపిఐఐసి స్వాధీనం చేసుకున్నా బ్రిడ్జి నిర్మాణంకు చొరవ చూపలేదు. ఫలితంగా టెండర్ల దశలోనే పనులు ఆగాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు..

కియా పరిశ్రమ తెలుగుదేశం హయాంలోనే ఏర్పాటైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో పరిశ్రమ నిర్మాణపనులు శరవేగంగా జరిగాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కార్యరూపం దాల్చుతుందని పరిశ్రమల యజమానులు, ఉద్యోగులు, కార్మికులు ఆకాంక్షిస్తున్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తే ఈప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు వస్తాయని ఆశపడుతున్నారు.

ఏడు నెలల్లో 12 ప్రమాదాలు..

కియా ఇండస్ట్రియల్ ఏరియా పోలీసుస్టేషన్ పరిధిలో గడిచిన ఏడు నెలల్లో 12 భారీ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. కియా, అనుబంధ పరిశ్రమల నుంచి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం, వేళల్లో 1400 నుంచి 1600 పైగా బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు జాతీయ రహదారిపైకి వస్తుంటాయి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆర్‌ఒబి పూరైయితే ఈ ప్రమాదాలు నివారించవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

ఆర్‌ఒబి పనులు ప్రారంభించాలి



కియా అనుబంధ సంస్థలకు వెళ్లే వాహనాలు, ఉద్యోగులు, కార్మికుల సౌకర్యం కోసం తక్షణం ఆర్‌ఒబి పనులు ప్రారంభించాలి. కియా రాకతో జాతీయ రహదారిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నివారించేందుకు ఆర్‌ఒబి నిర్మాణ పనుల ప్రారంభానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

హరి, సిపిఎం జిల్లా నాయకులు.



సమావేశంలో సమీక్షిస్తున్న కలెక్టర్

పాఠశాలల నష్టంపై...

నివేదికలు సిద్ధం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా జిల్లాలో పలు పాఠశాలల భవనాలు కోల్పోవాల్సి ఉన్న నేపథ్యంలో వాటి నష్టం వివరాలు ఈ నెల 10వ తేదీలోపు నివేదికల రూపంలో సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. మంగళవారం నాడు కలెక్టరేట్‌లో జాతీయ రహదారుల విస్తరణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్‌తో పాటు రహదారుల విస్తరణ అధికారులు డిఇఒ కృష్ణప్ప, ఈఈ శంకరయ్య, డిఈ చితాంబరం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్యాకేజ్ 1,2,3,4, జాతీయ రోడ్డు విస్తరణలో భాగంగా కొన్ని పాఠశాలల ఆదనపు గదులు, వంట గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు, బోర్లు తొలగించాల్సి వచ్చిందన్నారు. సర్వ శిక్ష అభియాన్ అధికారులు, ఆర్అండ్‌బి అధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ఇవ్వాలన్నారు. బెంగళూరు, కడప, విజయవాడ జాతీయ రహదారులకు సంబంధించి పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ముదిగుబ్బ, బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల, చిలమత్తూరు, తలుపుల, కదిరి, ఓడిసి మండలాల్లో జరిగిన నష్టాన్ని అంచనాలు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఇఒలు గోపాల్ నాయక్, పద్మప్రియ, రెడ్డయ్య పాల్గొన్నారు.

426.2 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

తుఫాను ప్రభావంతో జిల్లా అంతటా సోమ, మంగళవారాల్లో అన్ని మండలాల్లో ఒక మోస్తారు వర్షాలు కురిసాయి. మంగళవారం రెవెన్యూ వారి లెక్కల ప్రకారం జిల్లాలో 426.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా రామగిరి మండలంలో 33.4 మి॥మీ॥ ధర్మవరం 31.4, గోరంట్ల 22.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా అన్ని మండలాల్లో ఒక మోస్తారు వర్షం పడింది. పుట్టపర్తిలో అతి తక్కువగా 3.6 మి॥మీ వర్షపాతం నమోదయింది. గత నాలుగు రోజులుగా తుపాను వల్ల ఈదురు గాలులు, చలి ఎక్కువగా ఉండడంతో వద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

పుట్టపర్తిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైం

పుట్టపర్తి పట్టణంలో కురిసిన వర్షంతో మంగళవారం సాయంత్రం మూడు గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని విద్యుత్ ఏఈ నారాయణస్వామి నాయక్ తెలిపారు. గోరంట్ల మండలం పాలసముద్రం క్రాస్ వద్ద 132 కెవి.లైన్ ట్రిప్ అయ్యిందని తెలిపారు. అదే సమయంలో పాలసముద్రం గోరంట్ల 33 కెవి లైన్ కూడా కుప్పకూలిందన్నారు. ఈ అంతరాయాన్ని సవరించడానికి చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల వద్ద 33 కెవి లైన్ మరమ్మతులు చేస్తుండగా జాయింట్ కిట్టు విఫలమైందన్నారు. వీటన్నింటి నేపథ్యంలో పుట్టపర్తికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణ ప్రజలు, వ్యాపారులు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఇబ్బందులు పడ్డారు.

భారత జట్టుకు ఎంపికవ్వాలి : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : క్రికెట్‌లో రాణించి భారత జట్టుకు ఎంపిరై కదిరి ప్రాంతానికి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ క్రీడాకారిణికి సూచించారు. ఇటీవల జరిగిన ఆంధ్ర అండర్ 15 క్రికెట్ పోటీలలో కదిరి క్రీడాకారిణి తేజస్విని రాణించింది. ఈ నేపథ్యంలో తేజస్వినిఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభినందించారు. కదిరి క్రికెట్ సంఘం అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు క్రికెట్ కమిటీ సభ్యులు పవన్ కుమార్ రెడ్డి హరి, ప్రసాద్ రెడ్డి, ఖాజాపీర్, ముబారక్, ఎల్లప్ప హర్ష, మాజీ రంజీ క్రీడాకారులు షాబుద్దీన్, సిరాజ్ తదితరులు తేజస్వినిని అభినందించారు

అపార్ కష్టాలు.. రోడ్డెక్కిన ప్రజలు



రోడ్డుపై బైటాయించిన ప్రజలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

అపార్ కష్టాలు విద్యార్థుల తల్లిదండ్రులను వీడటం లేదు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండల కేంద్రమైన బత్తలపల్లిలోని సచివాలయం1 సమీపంలోని తాడిపత్రిరోడ్డుపై మంగళవారం ఆందోళనకు దిగారు. జనన ధ్రువీకరణ పత్రాల కోసం నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సోమశేఖర్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి రమణ అక్కడికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పారు. త్వరలోనే అందరికి జనన ధ్రువీకరణ పత్రాలు అందించే ఏర్పాటు చేస్తామన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాలు ప్రతి ఒక్కరికి అందిస్తాం : జనన ధ్రువీకరణ పత్రాల కోసం వారి పరిధిలోనిసచివాలయాలు, మీసేవ కేంద్రాలలోగాని, నెట్ సెంటర్ గాని, మొబైల్లో సీఆర్ఎస్ పోర్టల్ నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ నరసానాయుడు కోరారు. నమోదు చేసుకొన్న ఐడీ నంబర్ తో సచివాలయం వద్దకు రావాలని సూచించారు. నమోదు వివరాలను పంచాయతీ కార్యదర్శి పరిశీలించి జనన ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తామని తెలిపారు. పెండింగ్లో ఉన్న పత్రాలను త్వరలోనే పూర్తి చేసి అందిస్తామన్నారు. స్థానికంగా ఉన్న ఆర్టీసీ హాస్పిటల్లో రోజు వారి జననాలు వందల సంఖ్యలో ఉంటున్నాయని వారికి పత్రాలు ఇవ్వటానికి ఆన్‌లైన్ బార్‌కోడ్ ఇవ్వడంతో జనాలు ఒక్కసారిగా వందల సంఖ్యలో వస్తున్నాయని పంచాయతీ కార్యదర్శి సచివాలయ ఉద్యోగులు తెలిపారు. దీంతో ఆలస్యం అవుతోందన్నారు.

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం

సచివాలయ సెక్రేటరీలు సమయపాలన పాటిస్తు ప్రజలు వారి వద్దకు తీసుకొచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ చైర్మేన్ బలరామిరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని 13, 14వ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాయలంలో ఉద్యోగుల సంఖ్య, వారి విధులపై ఆరా తీశారు. హాజరుపట్టికను పరిశీలించారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వివిధ సచివాయాల్లో విధులు నిర్వహిస్తున్న కొంత మంది సెక్రేటరీలు హాజరు పట్టికలో సంతకం చేసి, అవసరం లేకున్నా మూవెంట్ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లి పోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అది నిజం అని తేలితే ఆలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనీస వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - నల్లమాడ

మండల కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇన్నేళ్లుగా మండలకేంద్రంలోని అక్కమ్మ గారి వీధిలో ఎలాంటి సౌకర్యం లేక స్థానికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వృద్ధులు, చిన్నపిల్లలు రాత్రిపూట బయటకు వెళ్లాలంటే వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధిలో తాగునీటి సరఫరా లేదన్నారు. వీధిలో సీసీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాబర్ట్‌విల్సన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రమేషు, సూరయ్య, బాలాజీ నాయక్, రామకృష్ణ, శివరామయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

తాడిమర్రి : నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైద్య విద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పనిచేస్తునన్నరని చేస్తున్నారని నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సచివాలయం1లో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి సచివాలయానికి వచ్చిన ప్రజలు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమావేశ భవనంలో ఆశా వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సాంబశివ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పని భారం తగ్గించాలని వేతనం పెంచాలని కోరారు. తక్షణమే ఫోర్ జి మొబైల్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సీసీలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విఓఎల విధులకు ఆటంకాలు, తొలగింపులకు గురి చేస్తున్న సీసీలపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, లక్ష్మినారాయణ, కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏసీ రవీంద్రకు తమ డిమాండ్లతో కూడిన వినిత పత్రాన్ని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ, బిసి ఓసి మైనార్టీకి చెందిన వారు 10 నుండి 18 సంవత్సరాలుగా వివోఏలుగా పనిచేస్తున్నారన్నారు. వారిని విధుల నుండి తప్పుకోవాలని సీసీలు వేధిస్తున్నానన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్ నుండి విఓఎల పేర్లు తొలగించి, గ్రామైక్య సంఘాల గ్రూపుల నందు బలవంతంగా వివోఏ గా తొలగింపునకు తీర్మానాలు చేయించేందుకు ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. సీసీలు అధికార పార్టీ నాయకులకు పరోక్షంగా పనిచేస్తున్నారన్నారు. విఓఎల విధుల పట్ల ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ గ్రామైఖ్య సంఘాల అనుమతులు నియమ నిబంధనలకు ప్రభుత్వ సూచనలకు పట్టించుకోకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న సీసీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు వివోఏలు రంగులాల్, శశికళ, అంజి, వెంకటరమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టొద్దు'

ప్రజాశక్తి-పెనుకొండ

తెలుగుదేశం పార్టీ నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టొద్దని వైసిపి ముస్లిం మైనార్టీ నాయకులు హితవు పలికారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఓ సంఘటనపై టిడిపికి చెందిన కొందరు వైసిపి జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యేపై దుష్పచారం చేస్తున్నారని అన్నారు. జమియా మసీదుకు చెందిన స్థలంలో తెలుగుదేశం కార్యకర్త రియాజ్ ఉంటున్న రేకు షెడ్డ్ వివాదం జరుగుతోందన్నారు. ఈ విషయం మసీదు కమిటీ చర్చించి సమస్య పరిష్కారం చేస్తుందన్నారు. గతంలో జమీయా మసీదుకు సంబంధించిన సమస్యలపై ఏ ఎమ్మెల్యేకాని, ప్రజాప్రతినిధులు గాని జోక్యం చేసుకోలేదని వారు తెలిపారు. హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ ప్రశాంతంగా ఉన్న పెనుగొండలో లేనిపోని ప్రచారాలు చేసి ప్రజల మధ్య అఘాతం సృష్టించడం తగదన్నారు. కౌన్సిలర్ సద్దాంకు ఈ వివాదానికి ఎలాంటి సంబంధం లేదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సద్దాం, తయుబ్, జామియా మసీద్ అహమద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని సత్యసాయి తాగునీటి పథకంలో 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగభూషణం సోమవారం మృతిచెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి నాగభూషణం మృతదేహానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. జిల్లాలో సైబర్ నేరాల కేసులపై ఎస్పీ తన చాంబర్లో మంగళవారం సాయంత్రం డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సబ్ డివిజన్ వారీగా నమోదైన కేసులు సమీక్షించారు. ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఎన్ని పరిష్కారం చేశారని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఈ కేసులను పరిష్కారం అయ్యే విధంగా చొరవ చూపాలని ఆదేశించారు. సైబర్ నేరాలుకట్టడి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, ఉద్యోగులు, ఉన్నత హోదాలలో ఉన్న వారు సైతం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్నారన్నారు. కొరియర్ పేరుతో మోసాలు, చైల్డ్ ఫోర్నో గ్రఫీ, డిజిటల్ అరెస్టు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు మోసాలు జరుగుతున్నాయన్నారు. లక్షలు పెట్టుబడి పెడితే కోట్లు ఇస్తామని నమ్మబలకడం, వీడియోకాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్ ఇలా ఎన్నో రకాల మోసాలకు సైబర్ నేరగాళ్లు ఒడిగడతారని అలాంటి వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడితే సంఘటన జరిగిన వెంటనే బాధితులు 1930 నెంబర్ కి డయల్ చేసి సమాచారం అందించడం లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిఐ తిమ్మారెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు .

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని పాపాగ్ని నది పరివాహక ప్రాంతాలైన అలుగుండువారిపల్లి, నల్లగుట్లపల్లి తండా గ్రామాల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలకు ఈ పంట నమోదు తప్పనిసరి అని అన్నారు. నల్ల గుట్లపల్లి తండాలో వేరుశనగ పంట సాగు చేసిన భూమ్మ పొలాన్ని సందర్శించి వేరుశనగ పంటలో పాటించవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ఆంజనేయులు నాయక్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులకు శిక్షణ ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని షిర్డీ సాయిబాబా కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో గ్రామాల్లో జరిగే సాగునీటి ఎన్నికలకు సంబంధించి ఇఇలు, ఎఇలు, పిఒ, ఎపిఒలకు ధర్మవరం ఆర్‌డిఒ మహేష్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముళ్లకంపల తొలగింపు

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని వైబిహళ్లి పంచాయతీ పరిధిలోని పత్తికుంట క్రాస్ నుండి బుడ్డప్పపాలెం వరకు రోడ్డు ఇరువైపులా ఉన్న కంప చెట్లను మంగళవారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ముళ్లకంపలు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సర్పంచి రామాంజనేయులు స్పందించారు. జెసిబితో ముళ్లకంపలను తొలగించారు.

భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రంలో భూగర్భ డ్రయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఇఒఆర్‌డి కిష్టప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పంచాయతీ కార్యదర్శి నారాయస్వామితో కలిసి మండలకేంద్రంలోని కాలనీల్లో పర్యటించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి
O.S.NO:221/2023

Between:
K.జయరాములు S/o K.లక్ష్మన్న, D.NO.6-38-A, బలిజపేట, తలుపుల గ్రామం మరియు మండలం శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

డేరంగుల సరస్వతి D/o D.శంకర్ W/o బత్తల వెంకటరమణ, గొల్లపల్లి (గ్రామం) కటారుపల్లి (పోస్టు) గాండ్లపెంట మండలం Now R/at D.No 3-915 1వ క్రాస్ అనంత గ్రామీణ బ్యాంకు దగ్గర తపోవనం అనంతపురం అనంతపురం జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై దావాలో పై కోర్టువారు మీ హాజరు నిమిత్తమై 16/12/2024వ తేదీన వాయిదా వేసినారు. కావున మీరు 16/12/2024వ తేదీన ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయముగా గాని లేక మీ వకీలు ద్వారా కాని పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. అట్లు హాజరు కాని పక్షములో పై దావానా మీ పరోక్షమన తీర్మానము చేయుదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:16/12/2024
స్థలం:కదిరి

K.వరప్రసాద్, ఎం.ఏ.,బి.ఎల్.
వాదితరుపు వకీలు, కదిరి.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.
O.S. No:444/2021

Between:
పోతుల రాజేష్ రెడ్డి S/o రెడ్డెప్ప రెడ్డి, Residing at జవకల గ్రామం, కదిరి మండలం. ...Plaintiffs

మరియు

1.పోతుల రెడ్డెప్పరెడ్డి S/o బయారెడ్డి Residing at జౌవకల H/o చలమకుంట్లపల్లి, పందులకుంట పోస్ట్, కదిరి మండలం.
2.గోవిందు నీలమ్మ W/o Late విజయవర్ధన్ రెడ్డి
3.గోవిందు శ్రీకాంత్ రెడ్డి S/o Late విజయవర్ధన్ రెడ్డి
4.గోవిందు గౌతమి D/o Late విజయవర్ధన్ రెడ్డి No.2 to 4 all are residing at మాచిరెడ్డిపల్లి H/o పట్నం, కదిరి మండలం. ...Defendants

పై దావాలోని D1 to 4 ప్రతివాదులకు దావా సమన్లు

పై దావాలోని వాదులు (పోతుల రాజేష్ రెడ్డి), D1 to 4 ప్రతివాదులు అయిన మీ పైన మరియు ఇతరులపై Cancel of sale deed dated 20-04-1999 registered as document no.1847/1999 with regard to the AC.1.00 cents join out of the plaint schedule, మరియు permanent injunction కొరకు పై దావాను పై కోర్టులో వేసియున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 30/12/2024 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున మీరు 30/12/2024 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:30/12/2024
స్థలం : కదిరి

జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్,
వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ (జూనియర్ డివిజన్) జడ్జి గారి కోర్టు,కదిరి.
O.S. No:99/2021

Between:
జి.శ్రీనివాసులు ...వాది

మరియు

కె.ముస్తాఫా ...ప్రతివాది

ప్రతివాది అయిన కె.ముస్తాఫా హాజరు కొరకు

కె.ముస్తాఫా S/o కె.మస్తాన్ వలి, D.No:1-152, మెయిన్ రోడ్డు, కురుమాల గ్రామం, నల్లమాడ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. అయిన నీకు ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పై కోర్టులో నీపైన జి.శ్రీనివాసులు S/o జి.నారాయణప్ప, సంజీవుపల్లి, నల్లచెరువు మండలం అను వాదికి రావలసిన ప్రాంసరీ నోటు బాకీ రాబట్టుటకు పై కోర్టులో దావా దాఖలు చేసినాడు.కావున పై దావాలో నీ హాజరు కొరకు పై కోర్టు వారు 18-12-2024వ తేది వాయిదా వేసినారు. కావున సదరు తేదిన నీవు స్వయంగా గానీ లేక నీ ఉత్తర్వులు పొందిన వకీలు ద్వారా గానీ హాజరై ఏవైనా ఆక్షేపణలు వున్నచో నీవు తెలుపవలెను.అట్లు తెలపని పక్షంలో పై దావాను పై కోర్టు వారు నీ పరోక్షమున తీర్మానించుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:18/12/2024
స్థలం : కదిరి

ఎన్.సత్యనారాయణగుప్త, బి.ఎస్సీ., బి.ఎల్,
వాదితరుపు వకీలు, కదిరి

ఎంఎస్ఎంఇ సర్వేపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరాజు

ప్రజాశక్తి-హిందూపురం

సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) సర్వేపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని పారిశ్రామిక అభివృద్ధి అధికారి సంజీవ రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో టిపిఆర్ఒ క్రిష్ణప్ప ఆధ్వర్యంలో పురపాలక సంఘ వ్యాపారం చేస్తున్న వెల్ఫేర్‌కార్యదర్శులకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పారిశ్రామిక అభివృద్ధి అధికారి సంజీవ రాజు, సిఎంఎం గంగులయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందన్నారు. ఎనిమిది అంశాలపై సర్వే నిర్వహించాలన్నారు. వ్యాపార యజమానులు అందించే వివరాలను యాప్ ద్వారా నమోదు చేస్తు, వ్యాపార యజమాని ఎవరు..? ఎంత పెట్టుబడితో పెట్టారు..? వ్యాపారం ఎలా ఉంది...? సిబ్బంది కొరత ఏమైనా ఉందా...? కొత్త సాంకేతికత వినియోగిస్తున్నారా..? సిబ్బందికి శిక్షణ అవసరమా...? బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నారా...? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా...? సరుకు ఎవరికి ఎగుమతి చేస్తారు...? బ్రాండింగ్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా...? తదితర అంశాలపై సర్వే చేపట్టాలన్నారు. ఈ సర్వే ఆధారంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ద్వారా ఏటువంటి సహాయం కోరుతున్నారో గుర్తించి వారి వ్యాపారాభివృద్ధికి సహకరిస్తుందన్నారు. పరిశ్రమల ప్రాంతంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ద్వారా ఉపాధి కల్పించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అలాగే ఈ తరహా పరిశ్రమలు అభివృద్ధి చెందితే పురపాలక సంఘ ఆదాయ వనరుగా కూడా సమకూరుతుందన్నారు. నిర్దేశించిన గడువులోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో కొడిగెనహల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పరిగి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ ఎక్సెలెంట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 53 మంది పాల్గొన్నారన్నారు. వీరిలో 22 విద్యార్థులు రగ్బీ, టెన్ని కాయిట్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, లాంగ్ జంప్ డిస్కస్ త్రో, యోగా తదితర క్రీడల్లో ప్రతిభ కనపర్చారన్నారు. ప్రతిభా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సవరించాలి

నంబులపూలకుంట : పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహణలో భాగంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ సెలవు రోజుల్లో మినహాయించే విధంగా సవరణ చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ తయారుచేసిన వందరోజుల ప్రణాళికను ప్రతి ఉన్నత పాఠశాలలో డిసెంబర్ 1 నుంచి మార్చి 10 వరకు తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. శని, ఆది సెలవు దినాలలో సైతం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. విద్యార్థుల సంసిద్ధత, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సెలవు రోజులను మినహాయించి సంక్రాంతి సెలవులు అనంతరం ప్రత్యేక తరగతుల నిర్వహించే విధంగా మార్గదర్శకాలను సవరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నూతన బస్సుసర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - కదిరి టౌన్


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట, తదితరులు

ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కందికుంట బస్సును నడిపారు. కదిరి నుంచి అనంతపురం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా బస్సు సర్వీసును ప్రారంభించామన్నారు .ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మైనుద్దీన్‌తో పాటు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఎం సస్పెన్షన్ ఎత్తేయాలి

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని అమిదాలగొంది ఉన్నత పాఠశాల హెచ్ఎంపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి హత్యకు బాధ్యులను చేస్తూ హెచ్ఎంను సస్పెండ్ చేయడం, వ్యాయమ ఉపాధ్యాయురాలు ప్రసూనకి షోకాజ్ నోటీస్ ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ నాయకులు రామకృష్ణ, జి.రామకృష్ణ, జయరామరెడ్డి, వెంకటేశ్వర్లు,శ్యామ్ సుందర్, ముద్దునాగప్ప, రాఘవేంద్రరావు, సోమశేఖర్, బాలరాజు, జయరాం, మురళిధర్ తదితరులు పాల్గొన్నారు.

బత్తులపల్లి :మడకశిర మండలం అమిదాలగొంది పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయునికి ఇచ్చిన షోకాజ్ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని సత్యసాయి జిల్లా ఏపీఎస్ ఏపీఈఎ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి హత్య సంఘటనకు బాధ్యుడిని చేస్తూ హెచ్ఎం జాబేజ్ సస్పెండ్ చేయడం వ్యాయమ ఉపాధ్యాయురాలు ప్రసూనకు షోకాజ్ ఇవ్వడం అన్యాయమన్నారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ పీడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లస్కర్ నాయక్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మడకశిర మండలం ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థికి హత్యకు హెచ్ఎంను బాధ్యులుగా చేయడం సరికాదన్నారు. వెంటనే సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని ఎపిటిఫ్ జిల్లా కార్యదర్శి అంజినామూర్తి, సీనియర్ నాయకులు గురు రాజారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాందాస్ నాయక్, రవి శేఖర్, ఆడిట్ కన్వీనర్ నారాయణస్వామి, హిందూపురం, పరిగి, లేపాక్షి మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, నారాయణస్వామి, రామలింగం, కల్లూరు ఫణి కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో ప్రసిద్ధిగాంచిన అది పురాతనమైన పేట వేంకటరమణస్వామి దేవాలయ రథం మరమ్మతుకు లేపాక్షి దుర్గాలయ ట్రస్ట్ చైర్మన్ కరణం రమానందన్ విరాళం అందజేశారు. రథం మరమ్మతుకు గురైన విషయాన్ని తెలుసుకున్న ఆయన తన వంతు సహాయంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి నరసింహ మూర్తి, అర్చకులు రామాయణం, చరణ్, ఆలయ సిబ్బంది శివశంకర్ సమక్షంలో మంగళవారం రూ.1,50,116 విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భగీరథీ నవీన్, సూర్యనారాయణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని ఇలాహి ఫర్నిచర్ నిర్వాహకులు ముస్లిం మైనార్టీ మత పెద్ద అబ్దుల్ సలాం మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మంగళవారం అబ్దుల్‌సలాం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంటో టిడిపి ధర్మవరం పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, అబ్దుల్ మునాఫ్, నాయకులు నాగూర్ హుస్సేన్, నడిం మసీద్ అస్లాం, రాళ్లపల్లి షరీఫ్, మాధవరెడ్డి, భీమనేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలంలోని మద్దెల చెరువు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి పేకాట జూదరులను అరెస్టు చేశారు. ఈసందర్భంగా నలుగురిని అరెస్టు చేసి రూ. 8,770 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం రాత్రి రైల్వే స్టేషన్ పార్కింగ్ ఆవరణంలో నిద్రించిన ఆ వ్యక్తి ఉదయం చూసేసరికి మృతి చెందినట్లు గమనించినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అతని వద్ద ఎలాంటి సమాచారం లభించకపోవడంతో పూర్తి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్నాటక మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురు కర్నాటక మద్యం విక్రేతలను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. వారి నుండి మూడు ద్విచక్ర వాహనాలు, కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పరిగి మండలంలో నిర్వహించిన దాడుల్లో కరానటక మద్యం తరలిస్తున్న ఏ.వేలు, మారెప్ప, మారుతీలను అరెస్టు చేసి ద్విచక్ర వాహనాలు, కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

రఘువీరారెడ్డి వదిన కన్నుమూత

ప్రజాశక్తి - మడకశిర రూరల్


నివాళి అర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి వదిన లలితమ్మ సోమవారం రాత్రి బెంగళూరులో మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని మంగళవారం నీలకంఠాపురం గ్రామానికి తీసుకొచ్చారు విషయం తెలుసుకున్న వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మడకశిర మాజీ ఎమ్మెల్యే కె. సుధాకర్, సేవా మందిర్ విద్యాసంస్థల అధినేత శ్రీధర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంగలవాయి ప్రభాకర్ రెడ్డి తదితరులు లలితమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పరిగి

రైతులు సాగు చేసిన పంటలకు ప్రభుత్వం వర్తింజేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎడిఎ అల్తాఫ్ అలీ ఖాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ధనాపురం, ఎస్ బీరేపల్లి గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం పాల్గొన్న ఆయన పంటసాగులో అవలంభించాల్సిన యాజమాన్యపద్దతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ దాసు, వ్యవసాయ విస్తరణ అధికారి లలిత, పావని , రైతు సేవా కేంద్రం సిబ్బంది హరీష్, ఆదిలక్ష్మి, క్రాఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుండి అశోక్, నరేంద్ర ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయండి

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని ఏపిలపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి చాలా రోజులైందన్నారు. స్టాక్‌లేవని లైన్‌మెన్ చెబుతున్నాడని వాపోయారు. మడకశిరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకురావటానికి వాహనం బాడుగ ఇవ్వాలని అడుగుతున్నాడని తెలిపారు. ప్రభుత్వం భరించాల్సిన ఖర్చుల భారాన్ని ప్రజలపై వేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - బత్తలపల్లి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఆసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్సీసెల్ ఉమ్మల చంద్రశేఖర్, బీదాల నారాయణస్వామి, గడ్డం కాశప్ప తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో, అనంతపురం జిల్లా సంఘం ఏర్పాటుచేసిన సమావేశంలో బత్తలపల్లి మండలానికి చెందినఉమ్మల చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు పథకాలు వర్తించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుత్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యం లక్ష్యసాధనకు అడ్డుకారాదు



హిందూపురంలో విద్యార్థులకు వాటర్‌బాటిళ్ల అందజేత


కదిరిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



లేపాక్షిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - హిందూపురం

ప్రస్తుత సమాజంలో వికలాంగులు అన్ని రంగాల్లో రాణిస్తుండడం ఎంతో గర్వించదగ్గ విషయమని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. అంగవైకల్యం లక్ష్యసాధనకు ఏమాత్రం అడ్డుకారాదని సూచించారు. మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఎంఈఓ గంగప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ఎంతోమంది వికలాంగులు తమ తమ రంగాల్లో రాణిస్తూ ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం వికలాంగ విద్యార్థులకు లోక్ అదాలత్ ఆధ్వర్యంలో వాటర్‌బాటిళ్లు,పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా వివేకానంద మిలీనియం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు వికలాంగులకు స్వీట్లు, నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం, కౌన్సిలర్ డిఈ రమేష్ కుమార్, ప్రభుత్వ న్యాయవాది జి.శ్రీనివాసరెడ్డి, న్యాయవాది రత్నకుమార్, లోక్ అదాలత్ శారద, భవిత కేంద్రం శిక్షకులు లలిత, నందిని తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వికలాంగులను సకలాంగులతో సమానంగా చూడాలని న్యాయవాది కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పట్టణంలోని వికలాంగుల భవనంలో ఏర్పాటు చేసిన ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా న్యాయవాది కృష్ణమూర్తి హాజరయ్యారు. శ్రీ ఖాద్రి వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కె సూర్యనారాయణ చారి ఆధ్వర్యంలో వికలాంగుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అంజి , వైస్ ప్రెసిడెంట్ జి రామాంజులు, జాయింట్ సెక్రెటరీ గోపాల్ నాయక్ , తలుపుల మండలం నాయకులు కే గంగరాజు , అంజనేయులు, గాండ్లపెంట ఆంజనేయులు, ఎన్‌పి కుంట శ్రీనివాసులు, చారుపల్లి గంగాధర్, హరి ప్రసాద్, విశ్వనాథ, రఘునాథ్ రెడ్డి, అనిల్, ఎస్ లక్ష్మి దేవమ్మ, పి పార్వతి, జి లక్ష్మీ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి :మండల కేంద్రంలోని భవితా కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వికలాంగ పిల్లలను అందరితో సమానంగా చూడాలన్నారు. వారిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించి మంచి విద్య, శిక్షణ అందిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. అనంతరం పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు జవ్వాజి నాగరాజ్, శ్రీనివాసులు, ప్రదీప్, లింగరాజ్ మంజుల, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : వికలాంగులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని డీఈవో కిష్టప్ప, వికలాంగుల జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ బాబ, తెలిపారు కొత్త చెరువులోనే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు కొత్తచెరువు ,పుట్టపర్తి, బుక్కపట్నం, మండలాలకు చెందిన వికలాంగుల విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో డిఇఒ మాట్లాడుతూ వికలాంగులకు సరైన సదుపాయాలు కల్పిస్తే ఎంతో అభివృద్ధి చెందుతారన్నారు. వీరికి సమగ్ర శిక్షణ ద్వారా వారికి చేయూతనందిస్తామన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఐఆర్టీలు, ఉపాధ్యాయులు, సత్యసాయి భక్తులు వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టులోనిస మర్థనం వికలాంగుల సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ తాహశీల్దార్ జగన్నాథ్ మాట్లాడుతూ వైకల్యం అనేది శరీరానికి కానీ మనసుకు కాదన్నారు. వికలాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన వికలాంగ విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమర్థనం వికలాంగుల సంస్థ హెడ్ వెంకటేశ్వర్లు, ట్రైనర్లు శంకర్, నరసింహమూర్తి, కవిత, ప్లేస్మెంట్ అధికారి ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని బాలురు ఉన్నత పాఠశాల భవితా కేంద్రంలో మంగళవారం వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఇఒ నరసింహమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రాఘవయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ వికలాంగులను ఆదరించాలన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయురాలు సరళ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ గంగాధర్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప మాట్లాడుతూ వికలాంగులను సకాలంగులతో సమానంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి, వీరేంద్ర రెడ్డి, చారిటబుల్ సర్వీసెస్ పేరు మీద పీడీ సాయికృష్ణ వికలాంగులకు చలికాల దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల ఐఇఆర్‌పిలు సరస్వతి, చాముండేశ్వరి, ఈరన్న, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

తనకల్లు : స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ లలిత మాట్లాడుతూ వికలాంగులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 2 కళ్యాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఎమ్మార్పీ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : సమాజంలో వికలాంగుల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడాలని ఎంఇఒ సుధాకర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని భవిత కేంద్రం,నార్త్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు ఖాదిరెడ్డి ప్రసాద్,ఎమ్మార్పీ సిబ్బంది చంద్ర, బాలాజీ, మదనాపు మంజుల, వెంకటరమణ,తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారులు తిరుపాల్ నాయక్, చెన్నకేశవ కుమార్ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు.

లేపాక్షి : మండలంలోని భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ 2 కుళ్లాయప్ప, ప్రధానోపాధ్యాయులు గిరి పాల్గొన్నారు. ఈశ్వరమ్మ, ఇర్షాద్, ఐఇఆర్‌పి నరసమ్మ, ఫిజియోథెరపిస్ట్ రంగరాజు, ఎంఆర్‌సి సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : మండలంలోని భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవ వేడుకలు మండల విద్యాధి కారి సురేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు నిర్మల, ఉర్దూ పాఠశాల హెచ్ఎం భాష ఆధ్వర్యంలో నిర్వహించారు. భవిత కేంద్రం నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది షాను ఐఆర్పిలు నరసింగ బాబు, డి. నాగశేఖర్ రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తలుపుల : మండలంలోని భవిత కేంద్రంలో మంగళవారం వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామానాయక్, ఎంఇఒ వెంకట రాముడు, హెచ్ఎం శంకరప్ప , జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : లక్ష్మీ చెన్నకేశవపురం బాలుర పాఠశాలలో భవిత సెంటర్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగప్ప ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన ఎంఇఒ గోపాల్ నాయక్ మాట్లాడుతూ వికలాంగులు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్, ఉపాధ్యాయులు శ్రీలత, సరస్వతి, మల్లికార్జున, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.